సాక్షి చిత్తూరు

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



రొటేషన్ కోసమే రాజీనామా

పార్టీ ఆదేశాల మేరకు రొటేషన్ విధానంతో రాజీనామా చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర తెలిపారు. - 10లో



వైభవంగా సోమవారోత్సవం

రామకుప్పంలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో వైభవంగా సోమవారోత్సవం నిర్వహించారు. - 10లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	33	22
తిరుపతి	34	22
తిరుమల	30	18
గూడూరు	36	24
నగరి	34	23

న్యూస్‌రీల్

పిల్లలు దేవుళ్లతో సమానం



చిన్నారితో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : చిన్నపిల్లలు దేవుళ్లతో సమానమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. సోమవారం మండలంలోని చిప్పారపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కారేటి సురేష్‌రెడ్డి నివాసంలో జరిగిన ఫంక్షన్‌కు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దూదిమోహన్, నీలా పండరీనాథ్, దాము, మధురెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్పందన వినతులకు ప్రాధాన్యం



సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ సమస్యలపై స్పందనలో ప్రజలు అందించే వినతులకు ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పందనకు మొత్తం 251 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో సోమవారం పోలీసులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఏఎస్పీ సుధాకర్ వినతులు స్వీకరించారు. మొత్తం 20 అర్జీలు వచ్చినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. వినతులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

పంటకు పరిహారం పంపిణీ రేపు

చిత్తూరు కార్పొరేషన్: పుంగనూరు నియోజకవర్గంలో ఏనుగుల కారణంగా పంట నష్టపోయిన వారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా బుధవారం సదుంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పరిహారం పంపిణీ చేయనున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దాదాపు 200 ఎకరాల్లో మామిడి, వరి, టమాట పంటలు దెబ్బతిన్నాయని, బాధితులకు ఎకరాకు రూ.6 నుంచి రూ.12వేల చొప్పున మొత్తం రూ.12.66లక్షల అందించనున్నట్లు వెల్లడించారు.

'నాడు-నేడు'లో నాణ్యత తప్పనిసరి

పాలసముద్రం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనుల్లో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వృత్తి విద్యాధికారి దయానందరాజు స్పష్టం చేశారు. సోమవారం పాలసముద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాగుతున్న నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకే నిధులు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రిన్సిపల్‌పై ఉంటుందని తెలిపారు. పిల్లల హాజరు శాతం, పరీక్షల్లో వచ్చిన మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. అనంతరం కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధనంజయులు, అధ్యాపకులు సూర్యన్, వినాయకం, షణ్ముగం, బాలకృష్ణ, గిరిధరరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

అదివో..అల్లదివో..!

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవ సంరంభంతో తిరుగిరులు శోభాయమానంగా విరాజిల్లుతున్నాయి.
భక్తకోటి గోవింద నామస్మరణలతో మార్మోగుతున్నాయి.
మహిమాన్వితమైన మాడ వీధుల్లో విహరిస్తున్న మలయప్ప దివ్య తేజంతో అలరారుతున్నాయి.
వైకుంఠనాథుని స్తుతిస్తూ వాహన సేవల ఎదుట సాగుతున్న కళారూపాలు ఆధ్యాత్మికానందాలను పంచుతున్నాయి.
దేవదేవుని సేవలో పరవశిస్తూ.. తరిస్తున్నాయి.

- అంగరంగ వైభవంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- ఉదయం చిన్నశేష వాహనంపై విహరించిన మలయప్ప
- రాత్రి హంస వాహనాన్ని అధిరోహించిన శ్రీవారు
- ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన



హంస వాహన సేవలో అశేష భక్తజనం (ఇన్‌సెట్) రాయంచపై శ్రీవారు



తిరుమల: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం స్వామివారు బద్రినారాయణుడి అలంకరణలో చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తకోటిని అనుగ్రహించారు. నాలుగు మాడ వీధుల్లో భక్తులు గోవిందనామ స్మరణ మిన్నంటించారు. స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రాత్రి శ్రీమలయప్పస్వామి వారు హంస వాహనంపై వీణ ధరించి సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనసేవల్లో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, కలెక్టర్ కే.వెంకట రమణారెడ్డి, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఆనందం

వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సారి దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన కళాకారులు విభిన్న ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. సంప్రదాయ కళలతోపాటు, జానపద నృత్యాలకు ప్రాధాన్యమిస్తున్నారు.



చిన్నశేషవాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి





నరకాసుర వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



రాధాకృష్ణుల లీలావినోదం



కళాకారుల నృత్యభంగిమ

టార్గెట్ కుప్పం

- గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి
- వైఎస్సార్‌సీపీలో విభేదాలకు తావులేదు అందరం జగనన్న వర్గమే
- ఆత్మీయ సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

కుప్పం : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పంలో విజయం సాధించడమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. కుప్పంలో గెలుపే టార్గెట్‌గా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పార్టీలో ఎలాంటి విభేదాలకు తావు లేదని, అందరం జగనన్న వర్గీయులమే అని వెల్లడించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్దేశం మేరకు ఎన్నికల పోరుకు నేతలు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని సూచించారు. కుప్పం సీటును గెలిచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని కోరారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చి జగనన్న దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరుతెచ్చుకున్నారని కొనియాడారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తథ్యమని వివరించారు. కుప్పం ఎమ్మెల్యేగా భరత్ గెలుపు నల్లేరుపై నడకేనని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, వేదికపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం

బీసీలకు బాబు చేసింది శూన్యం

కుప్పం నియోజకవర్గంలో బీసీలు అధికంగా ఉన్నారని, 35 ఏళ్లుగా గెలిపించినా బీసీలకు చంద్రబాబు చేసింది శూన్యమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా చంద్రబాబు నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల నిర్మించలేకపోయారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. బీసీలకు చట్టసభల్లో అవకాశం ఇచ్చినా ఏకైక ముఖ్యమంత్రి జగనన్ననే అని వెల్లడించారు. కుప్పం ప్రజలు ఆలోచించి తమ శాసనసభ్యుడిగా భరత్‌ను గెలిపించాలని కోరారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

కార్యకర్తల అభిమానంతోనే..

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు పార్టీకి, అభ్యర్థికి పరిమితం కాదని, అది ప్రతి కార్యకర్త విజయమని ఎమ్మెల్సీ భరత్ స్పష్టం చేశారు. నాలుగేళ్లుగా అందరికీ అందుబాటులో ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందించానని తెలిపారు. కార్యకర్తల అభిమానంతోనే ఎమ్మెల్సీగా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ముందుకు సాగుతున్నామని వెల్లడివంచారు. నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి కుప్పంలో జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప, నరేష్ కుమార్ రెడ్డి, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

పార్వతీదేవిగా బోయకొండ గంగమ్మ



పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు ఆదిశక్తి పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువనే గంగమతల్లికి అర్చకులు విశేష అభిషేకం చేశారు. పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. వేదపండితుడు గోవర్ధన శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం జరిపించారు. బెంగళూరుకు చెందిన దుర్గ, శివకుమార్ దంపతులు, గుణనేత్ర, గురుప్రసాద్, బెలగులికి చెందిన వెంకటమ్మ, చిక్క మునిశెట్టి , పెద్దపంజాణి మండల ట్రాన్స్‌కో ఏఈ నాగలక్ష్మి, వెంకటరమణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని సేవించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బోయకొండ గంగమ్మ శ్రీమహాలక్ష్మి అలంకారంలో భక్తులను కటాక్షించనున్నట్లు ఈఓ తెలిపారు.

అన్న ప్రసాద వితరణ కేంద్రం

బోయకొండ గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కేంద్రం ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. సోమవారం ఈ మేరకు అన్నదాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించి భక్తులకు ప్రసాదం వడ్డించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సహకారంతో బోయకొండను మరింత అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు ఏ. రాజేష్ పాల్గొన్నారు.



అన్నప్రసాద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగరాజారెడ్డి

సంప్రదాయబద్ధంగా ప్రమాణస్వీకారం



నూతన పాలకమండలితో ఎంపీ రెడ్డెప్ప, పెద్దిరెడ్డి తదితరులు

- బాధ్యతలు చేపట్టిన బోయకొండ ఆలయ పాలకమండలి

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయ పాలక మండలి సోమవారం సంప్రదాయబద్ధంగా ప్రమాణస్వీకారం చేసింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సమక్షంలో ఆలయ ఈఓ చంద్రమౌళి నేతృత్వంలో కమిటీ చైర్మన్‌గా వి.నాగరాజారెడ్డి, సభ్యులుగా పి.రజని, కె.రామ్‌దాస్, జి.భారతి, ఏ.రాజేష్, ఎం.బుడ్డమ్మ, ఎస్.పవన్‌కుమార్, ఎస్.భాస్కర్‌రెడ్డి, సి.లక్ష్మీదేవమ్మ, కె. హైమావతి, డి.రెడ్డెమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా గంగిరెడ్డి ప్రమాణం చేశారు. అనంతరం పాలకమండలి చైర్మన్, సభ్యులకు అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను ఈఓ అంద జేశారు. పీకేఎం వుడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ ఆలీంబాషా, ఎంపీపీలు అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రామమూర్తి, రెడ్డెప్ప, మా జీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మా జీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, నేతలు చిత్తూరు రాధాకృష్ణ, ఠాణాధార్ నాగరాజా, లడ్డూ రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా సోమవారోత్సవం



విశేష అలంకరణలో సుబ్రమణ్యస్వామి

రామకుప్పం: మండలకేంద్రంలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో వైభవంగా సోమవారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఉదయం ప్రత్యేక అభిషేకం, విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉభయ దేవేరులతో కలిసి సుబ్రమణ్యస్వామి మయూర వాహనంపై మాడ వీధుల్లో విహరించారు. భక్తులు నాగ పడిగెలు, కావడులను సమర్పించారు. జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి, తహసీల్దార్ మురళి ఆలయానికి చేరుకుని స్వామివారిని సేవించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై నివేదిక

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వినియోగదారులకు జరిగిన సేవ లోపానికి గాను రూ.1,12,800 మొత్తాన్ని ఏఈల జీతాల నుంచి రికవరీ చేయాలని ఏపీ ఈఆర్సీకి అధికారులు నివేదిక పంపించారు. ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) నిబంధనలు పాటించనందుకు ఈ మొత్తాన్ని జీతాల నుంచి కట్ చేయాలని నివేదించారు.

రొటేషన్ కోసమే రాజీనామా

- పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కో–ఆప్షన్ సభ్యులు



రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తున్న పవిత్ర మురళీకృష్ణ

పలమనేరు : వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు రొటేషన్ విధానానికి అనుగుణంగా పదవికి రాజీనామా చేసినట్లు పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ తెలిపారు. సోమవారం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమెతోపాటు వైస్ చైర్మన్లు, కో–ఆప్షన్ సభ్యులు తమ రాజీనామా లేఖలను మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం కౌన్సిల్ సైతం రాజీనామాలకు ఆమోదం తెలిపింది. త్వరలోనే కొత్త చైర్‌పర్సన్ ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ క్రమంలో 28 నెలలుగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా విధులు నిర్వర్తించిన పవిత్ర మురళీకృష్ణ, వైస్ చైర్మన్లు చాన్మాకమాల్, కిరణ్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యులు సి.రాజ్యలక్ష్మి, హాజీరా, ఎస్డీ గౌస్‌బాషా తమ పదవుల నుంచి తప్పుకున్నారు.

గత ఒప్పందం ప్రకారం

పలమనేరు మున్సిపాలిటీలోని 26 వార్డులకు గాను వైఎస్సార్‌సీపీ 24 వార్డులను కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానం బీసీ మహిళలకు రిజర్వు కాబడింది. దీంతో 21 వార్డు కౌన్సిలర్ పవిత్ర, 12 వార్డు కౌన్సిలర్ చాముండేశ్వరి ఇరువురూపదవికోసం పోటీ పడ్డారు. దీంతో పార్టీ పెద్దలు కల్పించుకుని చెరో రెండున్నరేళ్లు చైర్‌పర్సన్‌గా పనిచేసేలా ఒప్పందం కుదిర్చారు.

సహకారానికి కృతజ్ఞతలు

రాజీనామాను ప్రకటించిన అనంతరం పవిత్ర మురళీకృష్ణ మాట్లాడుతూ పలమనేరు అభివృద్ధికి సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారం మరువలేమన్నారు. అనంతరం కొత్త మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమితులు కానున్న చాముండేశ్వరి, మండీ సుధా దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్లు, కోఆప్షన్ సభ్యులను మున్సిపల్ కమిషనర్ సత్కరించారు.

పకడ్బందీగా 'ఫస్ట్ లెవెల్ చెకింగ్'



సెల్‌ఫోన్ అప్పగించి తనిఖీకి వెళుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఈవీఎం, వీవీప్యాట్స్, బీయూ, సీయూల ఫస్ట్‌లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్నికల గోడౌన్ వద్ద ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ ప్రారంభించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ఫస్ట్ లెవెల్ చెకింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో 12 మంది బెల్ కంపెనీ ఇంజినీర్లు పాల్గొంటున్నారని చెప్పారు. తనిఖీ సమయంలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందుకోసం పటిష్ట పోలీస్ బందోబస్తు చేశామని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఎఫ్ఎల్‌సీ నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలోకి సెల్‌ఫోన్లు, కెమెరాలు,స్పై కెమెరాలను అనుమతించమని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, ఆర్‌డీఓ రేణుక, డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బ్యూలా, వివిధ పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, ఉదయ్, కోదండయ్య, గంగరాజు, ఎన్నికల సిబ్బంది ఉమాపతి, మనోజ్ పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ దొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

– రూ.30 లక్షల విలువైన 25 వాహనాల స్వాధీనం

పుంగనూరు : మోటార్‌సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు యువకులను అరెస్ట్ చేసి, 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం సీఐ రాఘవరెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. జల్సాలు, రేసులు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన నిందితులు పుంగనూరు, బంగారుపాళ్యం, మదనపల్లె, రాయచోటి, తిరుపతి, కదిరి, చిత్తూరుతో పాటు కర్ణాటకలో సైతం పలు ద్విచక్ర వాహనాలను అపహరించి విక్రయించారని వెల్లడించారు. సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నిందితులు పట్టుబడినట్లు వివరించారు. అందులో ఇద్దరు మైనర్లు కూడా ఉన్నారని తెలిపారు. విచారణలో పుంగనూరులో 8 ద్విచక్రవాహనాలు విక్రయించినట్లు తెలియడంతో వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు తౌసిఫ్, రఫీక్, తాహీర్, ముదసీర్, నిరంజన్, ఇద్దరు మైనర్లపై కేసులు నమోదు చేశామని చెప్పారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ సుమారు రూ.30లక్షలు ఉంటుందని వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన పోలీసులు ఎల్లప్ప, రెడ్డెప్ప, గురురాజా, చిన్నరెడ్డెప్ప, మోహన్‌రెడ్డి, ఢిల్లీబాబులకు రివార్డులు అందజేశారు.

వైన్‌షాపు ఉద్యోగిపై కేసు

చిత్తూరు అర్బన్: నగరంలోని వైన్‌షాపులో అధిక ధరకు మద్యం బాటిల్ విక్రయించిన ఉద్యోగిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ప్రభుత్వ ఐటీఐ సమీపంలోని వైన్ షాపులో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు మద్యం అమ్ముతున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస్ నాయుడుకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను దుకాణానికి పంపించగా, రూ.400 లకు విక్రయించాల్సిన మద్యం బాటిల్‌ను రూ.420 కు విక్రయిస్తూ సేల్స్‌మెన్ హేమకుమార్ పట్టుబడ్డాడు. వెంటనే అతడిని విధుల నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈఎస్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు.

వినతులకు ఎండార్స్‌మెంట్ తప్పనిసరి



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నమోదయ్యే ప్రతి అర్జీకి తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖలఅధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రీ సర్వే, 22 ఏ పలు సమస్యలను సీసీఎల్ఏ నియమ నిబంధనలకు లోబడి పరిష్కరించాలన్నారు. సీసీఎల్ఏ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 19వ తేదీన జగనన్నకు తోడు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం లబ్ధిదారుల ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో డీఆర్‌ఓ రాజశేఖర్, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎస్‌వో శంకరన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖాధికారి రబ్బానీబాషా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి పాల్గొన్నారు.

'మిషన్ శక్తి' విజయవంతానికి చర్యలు

మహిళల భద్రత సాధికారతకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని జేసీ తెలిపారు. బాల్యవివాహాలను నిర్మూలించేందుకు పకడ్బందీగా సర్వే చేపట్టాలని సూచించారు. ఈ మేరకు డివిజన్ స్థాయిలో సమన్వయ సమావేశాలను నిర్వహించాలని ఐసీడీఎస్‌పీడీ నాగశైలజను ఆదేశించారు.

మూడు పాఠశాలల్లో విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో లోటుపాట్లపై సోమవారం ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టాయి. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు టీచర్ల అలసత్వం, స్కూళ్లలో లోటుపాట్లను గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరదప్పనాయుడు మున్సిపల్ పాఠశాల, చిత్తూరు రూరల్ మండలం మాపాక్షి ఉన్నత పాఠశాల, యాదమరి మండలం కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో తప్పిదాలపై నివేదికలు అందించాలని ఆదేశించారు. ఆ మేరకు చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్, చిత్తూరు ఎంఈఓ– 2 మోహన్, గుడిపాల ఎంఈఓ– 2 గణపతి, యాదమరి ఎంఈఓ– 2 హెచ్ఎల్ఎన్ ప్రసాద్ విచారణ చేపట్టి నివేదికలు సిద్ధం చేశారు. డీఈఓ విజయేంద్రరావు ద్వారా ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపనున్నారు.

పెంచిన వేతనం అమలుకు వినతి



ఏపీసీకి వినతిపత్రం అందిస్తున్న పీజీటీలు

చిత్తూరు కలెక్టరేట్ : కేజీబీవీ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న పార్ట్‌టైం పీజీటీలకు పెంచిన జీతాన్ని అమలు చేయాలని పీజీటీలు విజయ, రేణుకాదేవి, జ్యోతి విన్నవించారు. సోమవారం ఈ మేరకు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2018–19 సంవత్సరాల్లో కేజీబీవీల్లో పార్ట్‌టైం పీజీటీలుగా విధుల్లో చేరామని తెలిపారు. ఈఏడాది జీతాన్ని పెంచుతూ మెమో జారీచేశారన్నారు. ఆ ప్రకారం తమకు రూ.12 వేల నుంచి రూ.26,759 జీతం మంజూరు చేయాలని కోరారు. ఏపీసీ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంతమ్మ, అశ్విని, ఝాన్సీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కల స్వాధీనం: ఒకరి అరెస్ట్

రామకుప్పం : మండలంలోని వీర్నమల పంచాయతీ వేమనపల్లెలో మాణిక్యం(40) అనే వ్యక్తి తన చేనులో అక్రమంగా పెంచుతున్న రెండు గంజాయి మొక్కలు పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

జ్యూస్ ఫ్యాక్టరీ వ్యర్థాలతో అనర్థాలు



కాలువలోకి చేరిన వ్యర్థపు నీరు



ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

– తాగునీటి కలుషితంపై స్థానికుల ఆందోళన

శ్రీరంగరాజపురం : మండలంలోని జంగాలపల్లె వద్ద నెలకొల్పిన వెజ్ బై నేచర్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ జ్యూస్ ఫ్యాక్టరీ నుంచి విడుదల చేస్తున్న వ్యర్థాలతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఈమేరకు ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ జ్యూస్ ఫ్యాక్టరీ రావడంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ముందుగా సంతోష పడ్డామన్నారు. అయితే దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమై రోగాల బారిన పడతామని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యర్థపు నీటిని సమీపంలోని కాలువ, చెరువులోకి వదలిపెట్టి తమ ప్రాణాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. కలుషిత నీటిని తాగడం ద్వారా చర్మ, శ్వాస కోశ వ్యాధులు, విరేచనాల బారిన పడుతున్నామని తెలిపారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ఎన్నిసార్లు ప్రశ్నించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఫ్యాక్టరీ వాళ్లు పడేసిన మామిడి ముట్లు తిని ఆరు మేకలు మృతి చెందాయని, వాటికి ఇప్పటివరకు కనీసం పరిహారం కూడా చెల్లించలేదని వివరించారు. ఈ ఫ్యాక్టరీ వల్ల ప్రయోజనాల కంటే అనర్థాలే ఎక్కువగా ఉన్నాయని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తమను కాపాడాలని విన్నవించారు.

బాలిక మృతి కేసు సీబీఐకి అప్పగించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వడ్డెర సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : పెనుమూరులో ఇటీవల మృతి చెందిన బాలిక కేసును సీబీఐకి అప్పగించాలని వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రవిమకాలి డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. బాలిక మృతి కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై తమకు సందేహం ఉందన్నారు. అనుమానితులుగా పేర్కొన్న వ్యక్తులు బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. ఈ కేసు సీబీఐకి అప్పగిస్తే బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం స్పందనలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్, జైరాం, రమణ పాల్గొన్నారు.

అంత్యక్రియల అడ్డగింత

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం ఆదిఆంధ్రవాడకు చెందిన వల్లెమ్మ(55) అనే మహిళ సోమవారం మృతి చెందింది. ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానికి తీసుకెళ్లితే ఓ వ్యక్తి అది తన స్థలమేని అడ్డుకున్నాడు. ఆ భూమిని ప్రభుత్వం తమకు శ్మశాన స్థలంగా కేటాయించిందని స్థానికులు తెలియజేసినా పట్టించుకోలేదు. అక్కడ ప్రభుత్వ భూమి అని బోర్డు కూడా పెట్టారని స్థానికులు ఆగ్రహించడంతో ఆ భూమిని ఆక్రమించిన వ్యక్తి వెళ్లిపోయాడు. రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇద్దరు కూలీల ఘర్షణ : ఒకరి మృతి

నగరి : మండలంలోని దామరపాకంలో ఇద్దరు కూలీలు ఆదివారం రాత్రి ఘర్షణకు దిగడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు.. విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నుంచి గ్రామంలోని రైతుల పొలాల్లో చెరుకు కొట్టడానికి కొంతమంది కూలీలను పిలిపించారు. వారిలో సత్యబాబు, పసుపురెడ్డి అప్పన్ అనే ఇద్దరు కూలీలు భోజనం చేసే సమయంలో గొడవ పడ్డారు. దీంతో సత్యబాబు తలపై అప్పన్ కర్రతో బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని తిరుపతి రుయాకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ కుళ్లాయప్ప తెలిపారు.

యువకుడికి కత్తిపోట్లు

నగరి : పట్టణంలోని బస్టాండు ప్రాంగణంలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో అజిత్ (23) అనే యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం బాధితుడిని స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు తరలించారు. ఘర్షణకు గల కారణాలను, కత్తితో పొడిచిన వారెవరనే దానిపై పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేపట్టారు. దర్యాప్తు అనంతరం వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ కుళ్లాయప్ప తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



గుడిపాల : రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న గుర్తు తెలియని మహిళ సోమవారం మృతిచెందినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. చిత్తూరు–వేలూరు రహదారిలోని గొల్లమడుగు వద్ద ఈ నెల 4వ తేదీన గుర్తుతెలియని మహిళను లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. మృతదేహాన్ని చిత్తూరు మార్చురీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796712 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వైద్య ఆరోగ్య సేవల తనిఖీ



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

చిత్తూరు రూరల్: జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలను సోమవారం కేంద్ర బృందం తనిఖీ చేసింది. చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీసింది. మాత్రల సరఫరా, వినియోగం తదితర అంశాలపై క్షుణంగా పరిశీలించింది. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమై మాతాశిశు మరణాలపై విచారణ చేసింది. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించింది. ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించింది. కార్యక్రమంలో కేంద్ర బృందం అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి, డీఐఓ రవిరాజు, టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్, వైద్యాధికారులు మాధవి, హర్షవర్ధన్, సందీప్ పాల్గొన్నారు.

ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం తదితరులు

కుప్పం : వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయని ఎంపీ రెడ్డెప్ప మండిపడ్డారు. సోమవారం కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీలో ఎలాంటి విభేదాలు, వర్గాలు లేవని తెలియజేసేందుకే ఆత్మీయ సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో కుప్పంలో సైతం వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. కేడర్ అంతా సమష్టిగా పనిచేసి చంద్రబాబును ఇంటికి, భరత్‌ను అసెంబ్లీకి పంపడం ఖాయమని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తున్నామని వివరించారు. ప్రతి ఇంటికీ మంచి జరిగితేనే వైఎస్సార్‌సీపీకి ఓటెయ్యండి అంటూ జగనన్న ఇచ్చిన పిలుపుపై కుప్పం వాసులు ఆలోచిస్తున్నారన్నారు. పార్టీలో వైషమ్యాలు తీసుకువచ్చేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని, శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కార్యకర్తలను ఎన్నికలు సన్నద్ధం చేసేందుకే ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును వివరించినట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలోనూ పార్టీ కార్యకర్తలను ఉత్తేజితం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పార్టీ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి, మొగసాల రెడ్డెప్ప, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ సుధీర్ పాల్గొన్నారు.